# మెఱుపులు: చాణక్యసూక్తి

**- వేమూరి వేంకటరామనాథం**

ఈ వ్యాసం వ్రాయవలెనన్న ఊహ ఇటీవల నేను చదివిన "నీతి సాహస్రి" అన్న పుస్తకంలోని చాణక్య సూక్తులు గమనించి నప్పుడు కలిగింది. ఇది శ్రీ రామవరపు శరత్ బాబు, శ్రీమతి శాంతి శారదాపూర్ణ వ్రాసిన అనువాదగ్రంథం. మూలం చాణక్యుని (కౌటిల్యుని) జగద్విఖ్యాతమైన సంస్కృతగ్రంథం "అర్థశాస్త్రము". అందులోని కొన్ని శ్లోకాలు, వాటి (తెలుగు) తాత్పర్యం సులభమైన వచనంలో ఇందు సూచించబడినాయి.

చాణక్యుని చారిత్రిక ఘనత పాఠక మహాశయులకు తెలిసియే యుంటుంది. నేనది యిక్కడ ప్రత్యేకంగా నివేదించటం లేదు. చంద్రగుప్త మౌర్యునికి చక్రవర్తిత్వం కల్గించిన మహామహుడు చాణక్యుడు. ఈ అర్థశాస్త్రము క్రీ. పూ. 321 - 300 సంవత్సరములలో వ్రాయబడి యుంటుంది. పరిపాలన విధానాలను గుఱించి, పరిపాలకులను గుఱించి, రాజకీయములను గుఱించి వ్రాయబడిన అనుభవపూర్వకమైన ఆఱు వేల శ్లోకాల గ్రంథమీ అర్థశాస్త్రము. అందుగల విషయాలు స్త్రీల మీది "చణుకులు" తప్ప చాల వఱకు ఈ నాటికి కూడ "యథాతథం" గా వర్తిస్తాయని అవి చదివిన విబుధులు అభిప్రాయ పడుతున్నారు. పరిపాలక స్వరూపంలో ఎన్నో మార్పులు క్రమంగా వచ్చినా, ఈ నాడు కూడ కౌటిల్యుని రచనా సూత్రాలు చాలవఱకు అర్థవంతంగాను ప్రయోజనకరంగాను ఉంటాయి, అని యీ "నీతి సాహస్రి" చదివిన వారికి తట్టక పోదు. ఇందలి ఎన్నో శ్లోకాలు - వాటి తెలుగు తాత్పర్యం - మన పరిస్థితులకు కూడ తగినవని మనం గ్రహించగలం.

ఇది విశదీకరించటానికి అనువైన అనేక శ్లోకాలలో ఒకటి సూత్రం ఈ వ్యాసానికి తీసికొన్నాను, వివరమైన సమీక్షకై.

"ప్రవీణః స్వామినో భక్తః సత్యవాదే జితేన్ద్రియః

అలుబ్ధః స్వధనై స్తృప్తో గధ్యక్షో మహీపతేః"

"పాలకుని గనులపై అధ్యక్షుడు నేర్పరి, స్వామి భక్తిపరాయణుడు, సత్యవాక్పరిపాలకుడు, ఇంద్రియ జయము కలవాడు, ఆశలేని వాడు, తన సంపదతో తృప్తినొందు వాడునై యుండవలెను." (పుట. 29)

ఈ సూక్తి - సందర్భ రీత్యా - పాలకుని క్రింద పనిచేసే గనుల శాఖాధిపతిని గూర్చి చెప్పబడింది. నిజానికి ఇది ప్రభుత్వం లోని యే ఉన్నత ఉద్యోగికైనా - అంతే కాదు ప్రభువునకైనా - వర్తిస్తుంది. మఱొక మాట. ఆనాటివలె ఈ నాడు చాల దేశాలలో ప్రభువు - రాజు అన్న అర్థంలో - లేడు గదా, ప్రజాస్వామ్యం వర్థిల్లుతున్న కారణంగా. అందువలన నేటి పరిస్థితులకు అనుగుణంగా ఈ సూక్తిని ఉన్నత ప్రభుత్వపీఠం లో కూర్చున్న వ్యక్తి పరంగా మనం అన్వయం చేసుకోవాలి - ఉదాహరణకు, ముఖ్యమంత్రి లేక ప్రధాన మంత్రి లేక అధ్యక్షుడు.

ఈ సూక్తిలోని వివిధ అంశాలను గుఱించి అతి సులభంగా వ్యాఖ్యానించవచ్చును. దానిలో చెప్పబడిన సామర్థ్యాలకు, గుణ గణానికి గల ప్రాముఖ్యం ఎంత ఉదాత్తమైనదో మనం గ్రహించవలె నంటే, యీ నాడు ప్రభుత్వములలో అత్యున్నత స్థానాలు నింపుతున్న వ్యక్తుల గుణగణాలను - బైటపడిన అవకతవకల వలన - జాగ్రత్తగా రాజకీయ పక్షపాతం లేకుండా మనం పరిశీలిస్తే చాలు. చాలమంది పట్ల ఈ పరిశీలన అంత క్లిష్టమైనదిగా ఉండనే ఉండదు, ఏలనంటే వారి సామర్థ్యాలు - లేక వారి అనౌచిత్యాలు - జనబాహుళ్యానికి సులభంగా కనిపిస్తూనే ఉంటాయి. ఈ పరీక్షా చర్చలలో నేటి రాజకీయాల పుణ్యమా యని, ఎదురు పక్షములవారు నిరంతరం మ్రోగుతూనే ఉంటారు గదా - ఉన్నవీ, లేనివీ. సుస్థిర విచక్షణ చేయదలచిన (వలసిన) వారు ఆ మ్రోతలలోని సత్యాసత్యాలు అతి జాగ్రత్తగా సమీక్షించాలి; ఇది యెంత వఱకు సాధ్యమో కూడ పరిస్థితుల సాలీడు గూడుకే యెఱుక!

సులభమైన శైలిలో వ్రాయబడిన తాత్పర్యంలోని కొన్ని అంశాలను గూర్చి సంక్షిప్త వ్యాఖ్య చేతాం. పాలకునికి (వాని ఉన్నతోద్యోగులకు) వలసిన సద్గుణాలలో తొలిగా చెప్పబడినది నేర్పరితనం. ఇది విద్యాశాలలో గడించిన పట్టాలతో సమాన మని మనం ఊహించరాదు. ఇది జీవనపథంలో, రాజకీయ పర్యటనంలో, కార్యసాధనలో అత్యవసరమైన చాకచక్యంగా మనం గుర్తించాలి. ఇది ప్రధానంగా మూడు భాగాలుగా మనం అర్థం చేసికొనవచ్చును. ఒకటి, పరిస్థితులను గమనించి, లోపమేదో అది యెలా సరిదిద్దవలెనో

దీర్ఘకాలక్షేమం దృష్ట్యా దాని సవరణ ఎలా సాధ్యమవుతుందో సిద్ధాంతరీత్యా నిర్ణయించుకొనటం. ఇది కొంతవఱకు శాస్త్రనిపుణులు తెలియచేయగల విషయం. రెండు, సవరణవిధానాలను ఏ విధమైన కాలక్రమంలో నియంత్రించాలో, ఏయే ప్రాంతాలలో ఏయే విధానాలు ఎంతెంతవఱకు ఏయే కాల పరిధిలో ప్రవేశపెట్టవలెనో, గ్రహించగల శక్తి అవసరం. ఇది "తన" - పాలకుని - స్వీయప్రజ్ఞాపరిధికి చెందిన శక్తి. మూడవది - ఇది అంత సర్వసాధారణమైన అదృష్టం కాదు - తన విధానం అమలు పఱచటంలో అనుకొనని పరిణామాలేమైన సంభవిస్తున్నవేమో సూటిగా కన్గొనగల్గి, వాటిని సరిదిద్దటానికి వలసిన మార్పులు తన విధానంలో - అవసరమైనంత వేగంగా - ప్రవేశపెట్టగల్గటం. ఈ నాటి రాజకీయ పరిస్థితులలో ఇది యెంత కష్టసాధ్యమైన ఆవశ్యకమో వివరించి చెప్పనక్కఱ లేదు. "ఈయనకు ఏమి చేయాలో తెలియదు", లేక "ఈయనకు మనసు నిలకడ లేదు", "ఈయనకు అనుభవం సున్న" అనే వివిధ ప్రజాస్పందనలు అటుంచి, తన తోడి ప్రభుత్వోద్యోగులే, తన శాసనసభాసభ్యులే వానిని తక్కువచూపు చూస్తారు. అదృష్టం బాగుండక పోతే, వాని పదవికే భంగం రావచ్చును.

పైశ్లోకంలో చెప్పబడిన తరువాతి సద్గుణం స్వామిభక్తి పరాయణత్వం. వివిధ శ్రేణులలోని ఉద్యోగుల యెడ దీని అర్థం సులభగ్రాహ్యమే కాని, ప్రధాన పాలకుల పట్ల దీని అర్థం ప్రత్యేకంగా మనం వివరించుకొనాలి. ఇందులో నిశ్చయభావం యేమంటే దేశ సౌభాగ్యం - ఆకాంక్ష. ఇది అన్ని సద్గుణాలలోను అతి - అగ్రమైనది. పాలన చేతిలోగల నాయకుడు తాను ఎంతకాలం తన పదవిలో నిల్చి ఉండగలను అన్న తాపత్రయం కన్న, తన రాజకీయపక్షం ఎంత దీర్ఘకాలం పరిపాలన భాగ్యం కల్గియుంటుంది అన్న ఆదుర్దా కన్న, తన విధానాలు దేశక్షేమానికి ఎంతవఱకు దోహదం చేస్తున్నవి, అన్న స్వచ్ఛవిచక్షణ శక్తి కల్గియుండాలి. ఈ నాటి ఎన్నికల సందర్భంలో ఉన్నత "పాలకులు" ప్రజలకు కలిగించే భ్రమలను గూర్చి నేను ప్రత్యేకంగా వ్రాయనక్కఱ లేదు. అవి నిక్కంగా ఎంత వఱకు దేశక్షేమానికి, భావి సౌభాగ్యానికి దోహదమవుతాయో, ఎంతవఱకు తమ వైయక్తిక, లేక పక్షప్రయోజనానికి మాత్రమే త్రోవ చూపుతాయో, మనం గమనిస్తే, ఈ దేశభక్తిపరాయణత్వం అన్న రాజనీతి - చాణక్యుడు వాక్రుచ్చిన నీతి - మనకు తేటతెల్లమవుతుంది. ఇందలి అతి ప్రధాన - అంశం ఏమంటే పరిపాలకుడు దేశం యొక్క సౌభాగ్యం కొఱకు నిర్మలంగా, నిశ్చలంగా పాటుపడగల్గిన వాడై యుండాలి, తన పునఃప్రతిష్ఠ కోసం మాత్రమే కాదు.

"సత్యవాక్పరిపాలన" చాణక్యుడు చెప్పిన మఱొక అంశం. దీని ప్రాముఖ్యం దేశంలోని ప్రజల దృష్టిలోను, అంతకు దీటుగా అంతర్జాతీయంగాను, ఎంత ఉన్నత మయినదో నేను విశదీకరించనక్కఱలేదు. ప్రభుత్వ విధానాలు, శక్తి, చేతిలో ఉన్న పరిపాలకుడు - అనగా రాజకీయ నాయకుడు - తన మాటకు కట్టుబడియుంటే, ఆకీర్తి ప్రజలోను అంతర్జాతీయంగాను పెరిగితే, అది దేశ క్షేమానికి దోహదమవుతుంది. అంతే కాదు, తాను ప్రజకు ఆదర్శంగా గోచరిస్తాడు. మానవుని బ్రతుకులో అతి శ్లాఘ్యమైనది సత్యవాక్పరిపాలన అన్న అనాది సూత్రానికి తాను రూపంగా ప్రజలలో ఉత్సాహం కలిగిస్తాడు. ఇది సత్యహరిశ్చంద్రుని నాటి నుండి మహోత్తమ గుణంగా మనం గమనిస్తూవచ్చాము.

"ఆశలేనివాడు" అన్న సూచనకు దురాశ లేక పేరాస లేనివాడు అని చెప్పవలసియుంది. ప్రభుత్వపీఠంలో ఉన్న వానిస్వంత - ఆశకు మితిలేకుంటే, తన పదవి (తాత్కాలికంగా నైనా) సాధ్యం చేయుగలిగిన స్వీయ లాభాలకోసం ఎగబడితే, బహుశా తన పదవిని దుర్వినియోగం చేయటం వలన సాధ్యమయ్యే స్వప్రయోజనాలను రుచి చూసి వాటిని పెంపొంద జేసికోవాలని తాపత్రయం పడితే, వానికి అప్రతిష్ఠ రావటమే కాక, ఱేపో మాపో వాని పదవికే ముప్పు వాటిల్లుతుంది. అంతేకాక, వాని ప్రభుత్వంలోని ఉద్యోగులు - మంత్రులతో సహా - తన వలెనే దురాశా పీడితులై జనులకు అనర్థం కలిగించటం తటస్థిస్తుంది. పరిపాలన అంతా స్వార్థపంకిలం అవుతుంది.

"తన సంపదతో తృప్తి" గలవాడు అన్న తుది వాక్యం పై సూచనకు అనుగుణమైన మఱొక ధ్యేయం సూచిస్తుంది. ప్రభుత్వం చేతిలో ఉన్న వ్యక్తి తన సంపదను పెంపొందించుకొనటం తన దైనిక క్రమంలో ముఖ్యమైన ఆవృత్తిగా పెట్టుకొంటే, వానికి గల అవకాశాలు విపరీతంగా ఉంటాయి. తన ప్రవర్తన క్రమంలో తాను పాలించే దేశానికి నష్టం కల్గకపోదు; దేశానికి అపకీర్తి పెరుగుతుంది; ప్రజాబాహుళ్యం దైనిక ప్రవర్తనలో లోపభూయిష్ఠమైన కోణం ఉధృతమైపుతుంది. నైతిక జీవనం జీర్ణించిపోతుంది. ఈ తఱుగుదల భావికాలంలో స్ఫుటంగా సద్దుకొనటం అంత సులభంగా సంభవించదు.

సంపదపై దురాశ అన్నది ఏ ఒక్క దేశానికి మాత్రమేపరిమితమైన దుర్గుణం కాదు. ఇది విశ్వసించడానికి ఈ మధ్య అమెరికాలో తటస్థమైన ఒక సంఘటన గమనించవచ్చును. ఇల్లినాయి గవర్నరు ఒబామా స్థానంలో మఱొకరిని సెనేటులోనికి ప్రతిపాదించే అధికారం ఎలా దురుపయోగం చేసికొన జూచాడో అన్న విషయంపై ఎంత నేరారోపణ జరిగిందో మనకు విదితమే గదా. అందులో నిజమెంతో బ్రహ్మ కెఱుక, కాని అదినిజమని, ఆ అధికార ప్రవర్తన, దురాశ అసమంజసమని పాలితప్రజ దాదాపు ఏకకంఠంతో మ్రోగారు. ఆయనను పరిపాలక (గవర్నరు) పదవి నుండి తొలగించారు.

పరిపాలకుని పరంగా చెప్పబడిన ఈ నీతి సూత్రాలు ప్రజాసామాన్యానికి కూడ వర్తిస్తాయి కాని, పరిపాలకునిలో ఈ దృష్ట్యా లోపాలు ఉంటే వాటి అనర్థం తనకే కాక ప్రజాబాహుళ్యానికి కూడ తగులుతుంది. పాలకుడు ప్రజ యొక్క శ్రేయస్సుకు చాల వఱకు కారణభూతుడు అవటం వలనవాని చర్యలు, మనస్థితి, నైతికంగా వాని స్థాయి ప్రాముఖ్యం గడిస్తాయి. ఇవి కౌటిల్యుడు సూచించినట్లు సవ్యంగా ఉంటే ప్రజకు సౌఖ్యం, దేశంలో నైతిక దృష్టి వృద్ధి చెందుతాయి. ఈ విధంగా పాలకుడు జనుల భౌతిక సౌఖ్యానికే కాక నైతిక స్థాయికి కూడ కొంతవఱకు కారణభూతుడవుతాడని చెప్పవచ్చును.

చివర నొక సూచనతో ఈ వ్యాసం ముగిస్తాను. ఈ పుస్తకంలోని నీతులు ధృవీకరించినది కౌటిల్యుడు; ఈ అనువాదకులు వాటిని చక్కని తెలుగులో మన కందజేశారు. "మనకు" అన్నది నిజంగా మన అందఱి బుద్ధి వైశాల్యం కొఱకు అని మనం అర్థం చేసి కొన వచ్చును గాని, నాఉద్దేశ్యంలో ఈ నీతులను చిన్ననాడే గ్రహించవలసిన అవసరం విద్యార్థులకు ప్రధానంగా ఉన్నది. దీని సాధ్యతకు గల మార్గాలలో ఒక ముఖ్యమయినది మన పాఠశాలలో చిన్న తరగతులలోనే సమంజసంగా ఎన్నబడిన కొన్ని సూక్తులు పాఠ్యగ్రంథాలలో ఇముడ్చటం. భర్తృహరి సుభాషితాల వంటివే యివి కూడ. రెండువేల మూడువందల యేండ్లకు వెనకనే చంద్రగుప్తునికి చక్రవర్తిత్వం ప్రాప్తింప జేసిన మేధావి ముఖ్యంగా స్వానుభవంతో రూపొందించిన పరిపాలనా సూక్తులు. విద్యాధికారులకీ సూచన నచ్చితే, తగిన వాచ్యము ఈ "నీతిసాహస్రి" లో ఉన్నదని మనవి చేస్తున్నాను. కౌటిల్యుని భావసౌందర్యం ఈ అనువాదకుల భాషావాహ్య ములో చక్కగా ప్రతిబింబిస్తున్నది.